

# ప్రైవేట్ మాస్టర్


వడ్డాది వసుంధరాదేవి


"ఈ వేళ కూడా పద్యం రాలేదా నీకు?" విసుగ్గా కసిరినట్టుగా అడిగాడు వాసు.

ప్రేమ దిక్కుమొహం వేసింది. మాస్టారి మొహంలోకి చూడడానికి భయం వేసింది. తల వాల్చుకుని బెదురుగా కూర్చుంది.

"ఇక్కడే కూర్చుని చదువు. ఆ పద్యం వచ్చేదాకా నువ్వీ వేళ ఇంటికి వెళ్ళడానికి వీల్లేదు. కంఠస్థం చేసి, నాలుగు సార్లు రాసి చూపించు. ఏం?" గద్దించాడు.

నీళ్ళు నిండిన ప్రేమ కళ్ళు మిలమిల లాడాయి. కొండంత సంతోషంతో 'అలాగే' అన్నట్టు గబగబ తల ఆడించింది. వాసు తెలుగు టెక్స్టు ఆమె ముందుకి తోసి, తన పాంట్ జేబులోంచి అగ్గిపెట్టె తీసి స్టౌ ముట్టించాడు. టీ నీళ్ళు పడేసి, సిగరెట్ వెలిగించుకుని కిటికీ దగ్గర నిలబడ్డాడు.

ప్రేమ పెదవులు పద్యం వల్లిస్తున్నాయి. కళ్ళు మాస్టారి ప్రతి కదలికనీ జాగ్రత్తగా గమనిస్తున్నాయి. మాస్టా రెందుకో వారం నుంచీ కోపంగా ఉంటున్నారు. చిటికీ మాటికీ కసురుకుంటున్నారు. మునుపు పాఠాలు అప్పచెప్పక పోయినా సరే నవ్వి, "మొద్దూ!" అని తల మీద చిన్నగా తట్టి ఊరుకునే వారు. అలాంటిది ఇప్పు డిలా? మాస్టారికి పెళ్ళి కుదిరిందని అన్నయ్య చెప్పాడు. మరి పెళ్ళయితే సంతోషంగా ఉండాలి కానీ, దిగు లెందుకూ? తనకీ పెళ్ళయితేనా? ఎదురింటి వారిజలాగా బోలెడన్ని నగలు పెట్టుకుని, ఆయనతో స్కూటరెక్కి ఊరంతా సరదాగా తిరుగుతుంది. మాస్టారికి స్కూటర్ లేదుగా? అందుకని? అన్నయ్య నడిగి ఇప్పిస్తే సరి! ప్రేమ చప్పున "మాస్టారూ!" అంది మెల్లిగా.

వాసు వెనక్కి తిరిగి, "వచ్చేసిందా, ప్రేమా, పద్యం?" అన్నాడు.

దోసిలా కళ్ళు వాల్చి, మళ్ళా ఉత్సాహంగా అతనివైపు చూస్తూ, "మీకు, మీకు — పెళ్ళయితే ...?" అంది.

వాసు ఉలిక్కిపడ్డట్టుగా, "నీ కెవరు చెప్పారు, ప్రేమా?" అన్నాడు. ప్రేమ ఆగిపోయింది.

వాసు ఆమె దగ్గరగా వచ్చి, "నువ్వు టెన్త్ మూడు సార్లు ఎందుకు తప్పావో నాకిప్పుడు తెలిసింది! మీ అన్నయ్య నిన్నిలా పెద్ద కబుర్లు చెప్పనివ్వకుండ నీకూడా ఎవరిచేతో ముడేయించాల్సింది. పెద్ద విషయాలు చెప్పొద్దని ఎన్నిసార్లు చెప్పాను?" అని కఠినంగా అన్నాడు.

ప్రేమకి కోపమో, రోషమో ముంచుకొచ్చినట్టుగా పుస్తకంలో మొహం దాచుకుని గడగడ చదవసాగింది. ఆమె కంఠస్వరం క్రమంగా గద్గదంగా మారడం గమనించి వాసు పుస్తకం లాగేశాడు.

ప్రేమ బుగ్గల నిండా కన్నీళ్ళు!

"మాట్లాడితే ఏడుపు! చదవమంటే కబుర్లు! నిన్ను టెన్త్ పాస్ చేయించడం నా తరం కాదు, ప్రేమా! కళ్ళు తుడుచుకో! నీకే వస్తేది!" వాసు రెట్టించినా, ప్రేమ కళ్ళు విపరీతంగా నలుముకుంటూ ఏడుపు ఆపుకోవడానికి ప్రయత్నిస్తోంది.

రెండు క్షణాలు తదేకంగా ఆమె వంక చూసిన వాసు, నవ్వుమొహంతో, "ప్రేమా! పద్యం తరవాత చదువుదువు గాని! నీళ్ళు మరుగుతున్నాయి. టీ కలిపి పెట్టవూ?" అన్నాడు. ప్రేమ ఏడుపు ఆగిపోయింది. గబగబ మొహం తుడుచుకుని డికాక్షన్ చేస్తున్న ప్రేమని చూసి, 'ఈ అమ్మాయికి చదువు ఎలా ఒంట బట్టించాలి? ఈ అమ్మాయి మీద ఆశలు పెట్టుకుని పెద్ద చదువులు చదివించాలనుకుంటున్న వాళ్ళ అన్నయ్యకి ఏమని సమాధానం చెప్పాలి?' అని నిట్టూర్చాడు వాసు.

టీ కప్పు అందుకుంటూ సిప్ చేసి, "థాంక్యూ, డియర్! టీ చాలా బాగుంది. నీ పేరులోది కొంచెం ఇందులో కలిపావా?" అన్నాడు నవ్వుతూ. ప్రేమ విస్మయంగా చూసింది.

ఆమె అయోమయపు అవస్థని గమనించి వాసు ఇంకా నవ్వుతూ, "మీ అన్నయ్య తిడతాడని ఊరుకుంటున్నా గానీ, లేకపోతే నిన్ను ఏమని దీవించి ఉండే వాణ్ణో తెలుసా, ప్రేమా? నువ్విలాగే టెన్త్ పబ్లిక్ ప్రతి ఏడూ తప్పుతూ, నా దగ్గరే ప్రైవేట్ చదువుతూ, నాకు కమ్మని టీ కలిపి ఇస్తూ ..." అన్నాడు.

ప్రేమకి వాసు హాస్యం సగం అర్థమవక పోయినా గోముగా, "నాక్కూడా, మాస్టారూ! మీ దగ్గరే ఉండిపోవాలని ఉంది" అంది.

వాసు అదిరిపడ్డట్టుగా ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూసి, నవ్వు తెచ్చుకుంటూ, "తప్పు. అలా అనకో, ప్రేమా! గురువు తండ్రితో సమానం" అన్నాడు.

"ఇప్పుడు నేనేమన్నాను, మాస్టారూ!" తెల్లబోయింది ప్రేమ.

రెప్పవాల్చకుండా ఆమెనే చూస్తున్న వాసు మనసులో, 'నువ్వు ఎలా అన్నా నా అభిప్రాయం వేరు, ప్రేమా! నీ లేత వయస్సు చూస్తూ నువ్వు కుమార్తెతో సమానం అనుకోగలనా? నీకు వయసుతో పాటు మనసు పెరగడం లేదు. లేకపోతే రాత్రింబగళ్ళు నా దగ్గర ఇంత నిస్సంకోచంగా, నిర్భయంగా ఉండలేవు. నీకు ఆలోచనా శక్తి ఉంటే నా పట్ల నీ అభిప్రాయం ఎలా ఉండేదో మరి! నేను నీకు మాస్టార్ని. ఈ విషయంలో కూడా నీకు పాఠాలు చెప్పి తీరుతాను' అనుకున్నాడు.

"ప్రేమా! కప్పు కడిగి పెట్టేసెయ్" అన్నాడు. టీ కప్పు వాసు కావాలనే ఎడం చేతి పక్క పెట్టాడు. వాసు కూర్చున్న కుర్చీకి కుడివైపున నించుని ఉంది ప్రేమ. వాసు కాళ్ళు టీపాయ్ మీద అడ్డంగా ఉన్నాయి ప్రేమకి. వంగి కప్పు తీసుకుంది. ఇంద్రధనుస్సు వంపులో ఉన్న లేత అందాలు కనిపించాయి వాసుకి.

అప్రయత్నంగా చెయ్యి జాపి ఆమె పలచటి చేతిని అందుకున్నాడు.

"పద్యం వచ్చిందా, ప్రేమా?" అన్నాడు. ప్రేమ తల తిప్పి పెద్ద పెద్ద కళ్ళతో "లేదు" అన్నట్టుగా చూసింది. వాసు బలిష్ఠమైన తన చేతితో సుకుమారమైన ఆమె చేతిని గట్టిగా బిగించి ముందుకి గుంజుతూ, "ఎందుకని?" అన్నాడు. ప్రేమ బుంగమూతి పెడుతూ, "అన్నయ్యతో చెప్తాను" అంది.

వాసు త్రుళ్ళిపడి ఆమె చేతిని వదిలేసి, "ఏమని?" అన్నాడు కంగారుగా. ప్రేమ "నా చేత రోజూ టీ పెట్టించుకుని పద్యాలు చదవనివ్వడం లేదు అని!" అంది ఒత్తి పలుకుతూ. హృదయం మీద అనుకోకుండా పడిన బరువు తొలగిపోయినట్లైంది వాసుకి.

"మాస్టారూ! మాస్టారూ!" అంటూ రయ్యిమని వచ్చాడు సురేష్.

వాసు సర్దుకుని కూర్చుంటూ, "ఇంత లేటైందేం, సురేష్?" అన్నాడు.

సురేష్ గర్వంగా మొహం పెట్టి ప్రేమవైపు ఓ సారి చూసి, "రేడియోలో న్యూస్ వింటున్నానండీ" అన్నాడు పెద్దవాడిలా.

ప్రేమకి ఉక్రోషం ముంచుకొచ్చి, "ఉత్తదే, మాస్టారూ. న్యూస్ ఇంగ్లీష్‌లో చెపుతారు. ఎలా అర్థమవుతాయండీ?" అంది.

సురేష్ ఆమెని వెక్కిరిస్తూ, "టెన్త్ మూడుసార్లు తప్పిన వాళ్ళకు అర్థమవుతాయి కదండీ?" అన్నాడు.

ప్రేమ గయ్యిమని లేస్తూ, "నువ్వు తప్పలా ఏడో క్లాసు రెండుసార్లు? సిగ్గు లేకుండా నవ్వుతావేం? నేను డాక్టర్నవుతాను తెలుసా? మా అన్నయ్య చదువు కావాలంటే!" అంది.

"డబ్బులెక్కడ?" అని వెక్కిరించాడు సురేష్.

ప్రేమ స్లేటు మారుస్తూ, "పదిహేనేళ్ళు పెట్టుకుని సిగ్గు లేకుండా నిక్కర్లు వేసుకుంటున్నాడోచ్" అంది.


"మా ఆడపిల్లలు పద్నాలుగేళ్ళకి ఓణీ వేసుకుని ... ముసలాళ్ళల్లా ఛీ ఛీ!" అన్నాడు సురేష్.

"అయితే, మా నాన్నమ్మ ఓణీ వేసు



నింగీ నేలా

ఫోటో—కె. పద్మనాభుడు ( ఎడిగపేట )



# కళావాహినిలో నృత్య నాటకాలు



ఇటీవల కళావాహిని ఆధ్వర్యంలో మ్యూజిక్ అకాడమీ హాలులో పెద్ద ఎత్తున జరిగిన నృత్య నాటక కార్యక్రమం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఈ మధ్య కాలంలో జరగలేదనే చెప్పాలి. కళావాహిని వారు చక్కని ఏర్పాట్లు చేసి అందరి మన్ననలూ పొందారు.

రమాప్రభ సమర్పించిన కలువరేడు (నృత్యనాటిక), రాధాకృష్ణ (సంస్కృత నృత్యనాటిక), రాజీవం (నాటిక) మొత్తంమీద బాగున్నాయి. కాని, అటువంటి ప్రదర్శనలకు చాలా శ్రద్ధ అవసరమన్నది ఈ ప్రదర్శనలు ఋజువుచేశాయి.

డాక్టరు నారాయణరెడ్డి రచించిన కలువరేడు బాగుంది. రమాప్రభ, ఉష చక్కగా నటించారు. 'సినిమా టెక్నిక్‌లు రంగస్థలం మీద అంతగా రాణించవని పించింది.

లైట్లు నటులమీద వేయడానికి బదులు ప్రేక్షకుల మీదికి పదే పదే వేయడం అనుభవం ఉన్న వారు కూడా మైకులను ఉపయోగించుకోలేకపోవడం మొదలయిన లోపాలు తప్పిస్తే నాటకం బాగుంది.

సంస్కృత నాటకం రాధాకృష్ణ ప్రదర్శనకు చాలా శిక్షణ అవసరం అన్నివిధాలా.

మూడవ ప్రదర్శన — రాజీవం. ఇది గతంలో చాలా మంది ప్రదర్శించారు. ఆ స్థాయిలోకి అయినా ఈ ప్రదర్శనలేకపోవడం నిరుత్సాహమే కలిగించింది.

ఛాయా దృశ్యాలతో సంఘటనలను ప్రదర్శించే సమయంలో చెట్టుకొమ్మలు సర్దడానికి ఎవరివో చేతులు నృత్యంచేయడం భరించరానిది. రమాప్రభ, కె. కె. శర్మ, రత్నశ్రీ బాగా నటించారు.

ప్రథమంలో భరతనాట్యం చేసిన చిన్నారి అడుగుల సవ్వడిలో అపూర్వ భవిష్యత్ తొంగిచూసింది. ముచ్చటగా చేసింది.

మధ్యలో నేపథ్యగాయకులు ఆనంద్, మూర్తి, గిరిజ, పార్వతి పాటలు కార్యక్రమంలో ఒక విందు.

—ఎల్లోరా

---

కుంటుందా? ముసల్ది!" అని ప్రేమ కిలకిలా నవ్వింది. సురేష్ ఆగ్రహంతో ఆమె జడ పుచ్చుకుని లాగి, వీపుమీద ఒక్కటిచ్చాడు. ప్రేమ ఏం అనలేక, "మాస్టారూ!" అని బావురుమంది.

వాసు కెందుకో కోపంతో ఒళ్ళు తెలియలేదు! సురేష్ అంత చనువుగా ప్రేమను వీపుమీద కొట్టేంత అధికారం ... బెత్తం తీసుకున్నాడు. "ప్రైవేట్ కొచ్చి ఆడపిల్లని గోల చేస్తావా?" అంటూ.

ప్రేమ ఏడుస్తూ, "మాస్టారూ! సురేష్‌ని కొట్టకండి!" అని సురేష్‌ని అతుక్కుపోయింది. వాసు నిర్ఘాంతపోయి బెత్తం విసిరేశాడు.

సురేష్ అంటే తన కెందుకు పడదు? ఈర్ష్య అది? మరి? అశాంతిగా కూర్చున్న వాసుకి ప్రైవేట్ అయ్యాక ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని ప్రేమ, సురేష్ మాట్లాడుకుంటూన్న మాటలు వినిపించాయి.

"సురేష్! మాట్లాడవూ? నే నిందాకా ఊరికే అన్నాను. నీకు నిక్కర్లే ఎంతో బాగుంటాయి ..." ప్రేమ ప్రశంసించినా, సురేష్ కరగలేదు.

"ఫో! నాతో మాట్లాడకు. మాస్టారి చేత కొట్టించావుగా?"

"నన్ను ముసలిది అనలే నువ్వు?"

"అంటే? నువ్వు అన్నావని అన్నాను. అయినా, నీతో నాకేం పని? మాస్టారు నీ వల్లే నన్ను కొడుతున్నాడు. నువ్వు ప్రైవేట్‌లో చేరక ముందు నేనంటే ఎంతో ఇష్టం మాస్టారుకి. నన్ను 'ది బ్రిలియంట్ బోయ్' అనేవారు. నువ్వు వచ్చాక, అస్తమానూ నన్నుకొడుతున్నారు. నేను ప్రైవేట్ మానేస్తున్నా!"

"నేనూ మానేస్తాను."

"నువ్వంటే ఇష్టంగా మాస్టారికి?" ఎగతాళిగా అన్నాడు సురేష్.

వాసు ఉలిక్కిపడ్డాడు.

ప్రేమ కచ్చితంగా—"నాకు నువ్వంటే ఇష్టం" అంది సురేష్‌తో.

సురేష్ రెట్టిస్తూ, "మాస్టారంటే?" అన్నాడు.

ప్రేమ ఆలోచించి, "మాస్టారన్నా కూడా!" అంది.

సురేష్ ఆమెని ముద్దాయిలా చూస్తూ "ఎవ రెక్కువ ఇష్టం?" అన్నాడు.

"ఏమో, బాబూ, నాకు తెలియదు" అంది ప్రేమ.

"చెపితేనే నీతో మాట్లాడుతాను" అని షరతు పెట్టాడు.

"నేను చెప్పను" అని ప్రేమ రివ్వున పరుగెత్తింది.

అంతవరకూ బింకంగా నించున్న సురేష్ రివ్వున ఆమె వెనక పరుగెత్తాడు.

## 2

"కూర్చోండి. వస్తున్నా" అన్నాడు వాసు టవల్‌తో బాత్ రూమ్‌లోకి వెళుతూ. అతను స్నానంచేసి అద్దంముందు నిలబడి క్రాప్ దువ్వుకుంటూండగా ప్రేమ, సురేష్‌ల తగువు వినిపించింది.

"నువ్వేం ఆ సినిమాలో హీరోలా లేవులే." ప్రేమ కంఠం.

"నువ్వు మాత్రం ఆ సినిమాలో హీరోయిన్‌లా ఉన్నావా?"

"ఎందుకు లేను? నేను పైట వేసుకోలే? హీరోయిన్ లాగా!"

సురేష్‌కి ఏం చెప్పడానికీ తోచలేదు.

ప్రేమ విజయగర్వంతో, "ఆ హీరో లాగా నీకు పాంట్ లేదు, మీసాల్లేవు, టై లేదు" అని తేల్చిపారేసింది.

"నీకు మాత్రం? .." అని ప్రేమ ఓణీ వైపు చూసి సిగ్గుపడి ఆగిపోయాడు సురేష్. వాసు గదిలోకి వచ్చాడు.

అతని చూపులు ప్రేమ మీద నిలిచిపోయాయి.

రెప్ప వాల్చకుండా వాసువైపు చూసిన సురేష్ మెరుపులా అరుస్తూ — "ఆఁ! ఇప్పుడు తెలిసింది. మాస్టారు హీరోలా ఉన్నారు" అన్నాడు.

వాసు పెదవులపై మందహాసం మెదిలింది.

ప్రేమ విపరీతంగా సిగ్గుపడిపోయి మళ్ళా అతని వైపు పరీక్షగా చూసి, "ఏం కాదు. మాస్టారు హీరోయిన్ నాన్నలా ఉన్నారు" అంది.

వాసు మొహం మలినమైంది. అతని ఊహల్ని ఎవరో వెక్కిరించారు. అనుకోకుండా కలిగిన ఆగ్రహాన్ని సురేష్ మీద చూపిస్తూ వీపుమీద నాలుగు చరిచి, "పాఠాలు చదవకుండా ఏమిటా వెధవ్వాగుడు? బుద్ధి లేదూ?" అన్నాడు. సురేష్ ఏడుపు వస్తున్నా, మగపిల్లాడు కాబట్టి బింకంగా నిలబడ్డాడు. అతని వైపు చూస్తున్న ప్రేమ కళ్ళనిండా ప్రేమే! మొండిగా ప్రేమ చూపుల్ని, వాసు కోపాన్ని లెక్క చెయ్యకుండా నిర్లక్ష్యంగా నించున్నాడు.

సురేష్‌కి ఇంకా నాలుగు అంటించాడు.

• • •

ప్రేమ వెక్కి వెక్కి ఏడుస్తూ, "అన్నయ్యా! ప్రైవేట్‌కి సురేష్ రావడం లేదు" అంది.

రవీంద్ర చెల్లెలి మొహంలోకి ఆశ్చర్యపోతూ చూసి, "ఎందుకే?" అన్నాడు.

"సురేష్ ఇంకో మాస్టారి దగ్గర చేరాడు" అంది ఫిర్యాదుగా. "నే నింక చదవను" అంది.

రవీంద్ర చెల్లెలి వైపు వింతగా చూసి, "పోనీ, రామారావు మాస్టారి దగ్గర చేరతావే, ప్రేమా? వెధవ్వేషాలెయ్యకు. చదువు మానేస్తే నడ్డి విరిచేస్తాను. ఎక్కడో ఒక చోట ఎలాగైనా చదవాల్సిందే" అన్నాడు కోపంగా.

ప్రేమ క్షణం ఆలోచించి, "ఆయనకి పెళ్ళైందా?" అంది.

రవీంద్ర విస్తుపోయి, "లేదు. ఏం?" అన్నాడు.

ప్రేమ గదిలోంచి పారిపోబోయి ఆగి, "పెళ్ళవకపోతేనేం. . . మరెం . . . టే కలిపిస్తారు. అబ్బాయిల్ని కొడతారు. నన్నే బాగా చూస్తారు. . . వద్దు..." అనేసింది.

రవీంద్ర తెల్లబోయి చూడసాగాడు. ★